


# శాంతి ప్రేమజ్వాల

## అరవీటి సుందరరామరాజు

ఇది అరణ్యం కాదు. అందుకే పక్షుల కిలకిలారావాలు వినిపించడం లేదు. ఎద్దుల మెడలో మువ్వల శబ్దాలు, కళ్ళాపు చల్లే పడుచుల చేతుల్లోని గాజుల శబ్దాలు వీనుల విందు చేయడానికి ఇది అందమైన పల్లెటూరు కాదు.

కానీ ఇది జనారణ్యం. మన రాతలు రాసే విధాతలున్న సుంధర నగరం. ఐదేళ్ళకు ఒక్కసారి మాత్రమే దర్శన మిచ్చే దేవతలున్న స్వర్గం. మనలను అభాగ్యులుగా మార్చే భాగ్యనగరం వెరసి హైద్రాబాద్.

అయినా తూరుపు ఇక్కడా ఎర్రెర్రగానే విచ్చుకుంది. సూర్యుడు మామూలుగానే భగ్గుమం[illegible] బయటకొచ్చాడు. "అరచేతిని అడ్డుపెట్టి సూర్యోదయాన్ని ఆపలేము కానీ మేఘం మాత్రం సూర్యభగవానుని తీక్షణతను తగ్గించటానికి విఫలయత్నం చేస్తోంది.

ఎందుకంటే దానికి మానవుడిలాగా జ్ఞానం (స్వార్థం) లేదు. అందుకే నిరాశ లేదు.

సమయం ఆరుగంటలయింది.

అప్పటికి గంట ముందు నుంచే శాంతి హడావిడి మొదలయింది. వాళ్ళ బామ్మ అనిమేషురాలయి చూస్తోంది మనుమరాలిని.

పదిమందీ లేచి, పడుకున్న పక్కలెత్తి పనుల్లోకి పరుగెడుతున్నా ప్రక్క దిగని పంకజాక్షి 'ఏం పనుండి ఈ ప్రభాతవేళ ప్రయాణమవు తోందో' అర్థంకాక... ఆ ముసలావిడ శాంతి రెడీ అవుతుంటే చూస్తూ కూర్చుంది.

ప్రతి ప్రయాణం గమ్యం చేరకపోవచ్చు. కానీ ప్రతి ప్రయాణం వెనక ఓ ఆశ గమ్యం, గమనం తప్పక ఉంటాయి.

శాంతి తలస్నానం చేసి ఫ్యాన్ ముందు త్వరత్వరగా తల తుడుచుకుంటోంది. ఆమె తలపైనున్న నీటి చుక్కలకు ఆమె ఆతృత తెలిసినట్లు లేదు. అవి మెల్లమెల్లగా ఆమె అందమైన దేహాన్ని త్వరగా వదల్లేక తమ

ఉనికిని కోల్పోయి ఆవిరిగా మారేలోగా, ఏ కాస్తయినా అందమైన అనుభూతిని మిగుల్చుకోవటం కోసం ఆమె కురుల్లో నుంచి, ముఖం మీదకు, అక్కడి నుంచి గొంతుమీదకు, అలా కిందకు, అక్కడ నుంచి అందం వెల్లువెత్తగా, నీటి చుక్క తనను తాను మరచి శక్తిని మించి తానొక ఉత్తుంగ తరంగమని భ్రమించి, ప్రభంజనమై వేగంగా కిందకు జారి చివరకు తాకీ తాకగానే చిట్లిపోయి వేల వేల ముక్కలుగా మారి ఆమె అందాలను అభిషేకించి తన జన్మకో సార్థకత చేకూరిందన్న ఆనందంతో ఆవిరి అయింది.

శాంతి అందాన్ని గురించి ఇంకా చెప్పుకోవడమెందుకు, ఆ నీటి చుక్కపడ్డ ఆవేదన చాలదూ... అర్థం చేసుకోగలిగితే...?!

శాంతి మనసు అంత ప్రశాంతంగా ఏమీ లేదు. ఆమె ఎంత త్వరగా రెడీ అవుతున్నా ఆ వేగం చాలదని ఆమె మనసు తొందర పెడుతోంది. మనోవేగం సాధ్యపడక కంగారు పడుతోంది.

ఆమె మనసు ఇంకొన్ని గంటల్లో జరగబోయే సంఘటనను తలచుకుని ఉద్విగ్న భరితమవుతోంది. శరీరం కంపిస్తోంది పెదవుల పైన చిరునవ్వు పదే పదే మెరుస్తోంది.

ఈ రోజు పది గంటలకు రిజిస్ట్రార్ ఆఫీసులో శాంతి ప్రదీప్‌ల పెళ్ళి. పెద్దవాళ్ళకు తెలియకుండా అతి తక్కువ మంది స్నేహితుల మధ్య వారు ఒకటవబోతున్నారు.

శాంతికి తను చేయబోయే పనిపట్ల మనసులో ఏ మూలో భయం, సందేహం ఆమెను వేధిస్తున్నాయి. కానీ ప్రదీప్‌పైన ఆమె పెంచుకున్న నమ్మకం అల్లుకున్న ఆశలు ఆమె భయాలను సందేహాలను చెల్లాచెదురు చేస్తున్నాయ్.

'ప్రదీప్ అందగాడే కాదు, ఆత్మసౌందర్యం ఉన్నవాడు. చాలా డబ్బు ఉన్నా, సంస్కారం, సహనం పుష్కలంగా ఉన్నవాడు. నిస్వార్థపరుడు. ఇవ్వడం తప్ప ఇంకొకళ్ళది ఆశించని సహృదయుడు' అనే బలమైన నమ్మకం శాంతిది.

అలా కాదని ఎవరైనా అంటే...

"అతనితో మూడేళ్ళు కలిసి మెలిసి తిరిగి అతన్ని అన్ని రకాలుగా స్టడీ చేసి ఈ నిర్ణయాన్ని తీసుకున్నాను. అందరిలా పైపై మెరుగులు చూసి ఆకర్షణలో పడి ఇలా మాట్లాడ్డం లేదు. ఎవరు కాదన్నా, వద్దన్నా మేమిద్దరం ఒకటవక తప్పదు. అలా జరక్కపోతే కలిసి చావడమే.

## సీతారాముల కళ్యాణం

రామచంద్రుని పూజ చేయారే ఓ
అమ్మలారా రవ్వ శాయక పూజ
సేయారే
రాముడే వైకుంఠవాసుడు కలిలో
వేంకటేశ్వరుడై వెలసి భక్తులకెల్ల
కోర్కెలుదీర్చె వైభోగపురుషుడూ
॥రామ॥
దశరథ పుత్రుడే రాముడూ ఓ అమ్మలారా
కౌసల్య కొమరుడే ఇతడూ ॥రామ॥
పుత్రకామేష్టి చేసిన పుణ్య నగరమయోధ్యా
నగరం చైత్రశుద్ధనవమి పునర్వసున
జన్మించిన ధీరుడే ॥రామ॥
తపసి యాగముగాచిన ఘనుడే
శ్రీరామచంద్రుడు రాతిని
నాతిగాజేసెనే ॥రామ॥
శంకరుని చాపము త్రుంచి చేపట్టె
జానకీదేవిని ఆ పవిత్ర
పాదమ్ముగడిగిన ధన్యుడమ్మా
జనకరాజూ ॥రామ॥
సీతారాముల కళ్యాణము చేసీ భార్గవరాముని
చాపమ్ము గైకొని చేరిరమ్మా
అయోధ్యకూ ॥రామ॥
పన్నీట జలకమాడిరి శ్రీ సీతారాములు
పట్టుపీతాంబరములు కట్టిరీ ॥రామ॥

**- కోట అమ్మణ్ణమ్మ**

అలాంటపుడు పెద్దలకు తెలియకుండా పెళ్ళి చేసుకుంటే తప్పేమిటి? అనే బలమైన వాదన శాంతిది.

కానీ కాలం గొప్పది. దానికి మన నమ్మకాలతో వాదనలతో అవసరం లేదు. మనం మరచిన వాస్తవాలేవో వాటిని, చాలా కఠినంగా కర్కశంగా మనకు ఇష్టం ఉన్నా లేకున్నా తెలియజేస్తుంది. పేరెంట్స్‌కున్న దయ, జాలి దానకుండవు. అందుకే అన్నారు :

"కాలాన్ని మించిన నియంత వేరొకరు లేరని".

శాంతి రెడీ అయి తననే తదేకంగా చూస్తున్న బామ్మను చూసి ముసిముసిగా నవ్వుకుంటూ కన్ను గీటింది.

అంతవరకు ఆతృతను అణచిపెట్టి ఓపిగ్గా చూస్తున్న బామ్మ ఇక ఆగలేక "ఓసి నీ అసాధ్యం కూలా, ఈ సారి వైశాఖానికి మీ బావతో మూడుముళ్ళూ వేయించేస్తే సరిపోతుంది. నిన్నిలా వదిలేస్తే లాభం లేదు. రోజురోజుకూ నీ అల్లరి ఎక్కువైపోతోంది. ఇంతకూ ఇప్పుడెక్కడికే కొంపలంటుకున్నట్లు ఇంత ఉదయాన్నే తయారవుతున్నావ్?"

"బామ్మా ఇక ఆపవే... తాతయ్య ఎలా భరించాడో ఏమో నిన్ను...."

మళ్ళీ బామ్మ నోరు తెరిచిందంటే ఇక దానికి అంతే ఉండదు. ఆమె మాటలు విని మమ్మీ డాడీ నిద్ర లేస్తారు. ఇంత ఉదయాన్నే రెడీ అయిన తనను చూసి వాళ్ళు వేసే ప్రశ్నలు ప్రకటించే ఆశ్చర్యాలు, సందేహాలు తీరుస్తూ కూర్చుంటే శుభముహూర్తం కాస్త దాటిపోతోంది. ఇంకొక్క క్షణం ఆలస్యం అయినా బామ్మ నోట్లో ఇరుక్కుపోతాను అనుకుంటూ వేగంగా బయటకు పరుగెత్తింది.

స్కూటీ ఒక్క జర్క్‌తో ముందుకు దూకింది. వెనక బామ్మ ఏదో అరుస్తోంది. అప్పటికే శాంతి వినిపించుకోనంత దూరంలో ఉంది.

ఒకవేళ దగ్గరున్నా వినిపించుకోకూడదనే మానసిక స్థితిలో శాంతి ఉందని తెలియని బామ్మ గొణుక్కుంటూ ఇంట్లోకి వెళ్ళింది.

ఆమె వేగానికి స్కూటీ సరిపోవడం లేదు. గాలికి చెదిరిన ముంగురులు ఆమె ముఖంపైన అల్లరి చేస్తున్నాయి. వాటి స్పర్శ ప్రదీప్ ఊపిరిని గుర్తు చేస్తుంటే, ఆ ఊహకు శాంతి తనలో తాను నవ్వుకుంది.


ఇంకెంతసేపు, ఇన్ని రోజులు అతన్ని చాలా లిమిట్స్‌లో ఉంచింది. ఇక పెళ్ళయితే అడ్డేముంది? భార్యాభర్తల మధ్య సిగ్గేముంది?

శాంతి నడుపుతున్న స్కూటర్ రోడ్డుమీద పోతున్నా ఆమె మాత్రం ఊహల్లో విహరిస్తోంది. తనలో తాను నవ్వుకోవడం, అంతలోనే సిగ్గుపడడం, ఎదురుగా ఏదైనా వాహనం వచ్చినప్పుడు ఉలిక్కిపడి వాస్తవంలోకి రావడం.

శాంతి తనకు సన్నిహితంగా ఉన్న కొద్దిమందిని ఆహ్వానించింది. వారు నేరుగా రిజిస్ట్రార్ ఆఫీసు దగ్గరకు వస్తామన్నారు. కానీ తన చిన్ననాటి స్నేహితురాలు, అత్యంత ఆప్తురాలు అయిన 'జ్వాల' మాత్రం ఈ పెళ్ళికి రావడం నాకు ఇష్టంలేదని ఖరాఖండీగా చెప్పేసింది. ఆమెను ఎలాగైనా ఒప్పించి తీసుకు రావాలని బయలుదేరింది శాంతి.

జ్వాల శాంతికన్నా ప్రశాంతంగా కనిపిస్తుంది. ఆ అమ్మాయి కళ్ళల్లో విజ్ఞానం, ముఖంలో నిర్మలత్వం కలబోసిన అమాయకత్వం తొణికిసలాడుతుంటుంది. కాని ఆమెలో భావాలు, వ్యక్తిత్వం, నిరంతరం జ్వలిస్తూ ఉవ్వెత్తున ఎగసి పడుతుంటాయి.

శాంతి ప్రతి చిన్నదానికి ఎమోషనల్‌గా స్పందిస్తుంది. జీవితాన్ని తేలిగ్గా తీసుకుం



## సిమ్రాన్‌కి నాకు పోలికేంటి?

ఇప్పుడిప్పుడే వెలుగులోకొస్తున్న హీరోయిన్ సోనియా అగర్వాల్. 'నీకు సిమ్రాన్‌కి ఒకే పోలికలున్నాయని అంటున్నారు. దీని గురించి నువ్వేమంటావు?' అనడిగితే అర్థంకాని అదో తరహాలో సమాధానం చెప్పిందీ భామ. "అందరూ నన్నిదే అంటున్నారు. నేను నేనుగానే ఉండాలనుకుంటున్నాను. అయినా నాకూ సిమ్రాన్‌కీ పోలికేంటి?" అంటూ నిప్పులు చెరిగిందట. 'నేనేమన్నా సిమ్రాన్ ఎఫైర్లకీ, ఈమె ఎఫైర్లకీ పోల్చి అడిగానా ఏంటి? ఇంతగా కోప్పడుతోంది' అంటూ వాపోయాడు పాపం ఆ విలేఖరి.

టుంది. కానీ జ్వాల అలా కాదు. చాలా బలమైన వ్యక్తిత్వమున్న అమ్మాయి. జీవితంలో ప్రతి క్షణాన్ని సద్వినియోగం చేసుకోవాలం టుంది. ప్రతి విషయంలో చాలా క్యాలిక్యులేటెడ్‌గా ఉంటుంది.

శాంతి ప్రయాణిస్తున్న స్కూటీ, జ్వాల ఇంటి ముందు ఆగింది. శ్రీ వేంకటేశ్వరుని సుప్రభాతం వీనులవిందుగా వినిపిస్తోంది. జ్వాల అనుదినం తను చేసే యోగా, ధ్యానం, స్నానం, పూజ ముగించుకుని, కడిగిన ముత్యంలా అప్పుడే వికసించిన మల్లెపూవులా స్వచ్ఛంగా, ప్రశాంతంగా కూర్చుని ఉంది. సుప్రభాతం వింటోంది.

శాంతి స్కూటీ ఆపి పరుగెత్తుకుంటూ జ్వాల దగ్గరకు దూసుకొచ్చింది. ఇంతలో వెనక స్టాండు సరిగా వేయని స్కూటీ పడిపోయిన శబ్దం. శాంతి లోని అశాంతికి గుర్తుగా వినిపించింది.

శాంతిని చూసిన జ్వాల ముఖం చిరు నవ్వుతో దీప్తివంతమయింది. "ఏంటే పెళ్ళి కూతురా! ప్రేమలో పడ్డావా? ఇప్పుడు స్కూటీని పడేసుకున్నావ్. ఇంకాసేపట్లో సంసారంలో పడబోతున్నావ్. నీ జీవితంలో పడిపోవడం తప్ప ఇక వేరే వ్యాపకం ఉన్నట్లు లేదే?" అంటున్న జ్వాల దగ్గరకు వెళ్ళి ఉక్రోషంగా రెండు దెబ్బలు వేసింది శాంతి.

ఆమె నవ్వుకుంటూ "ఈ సరసాలన్నీ ప్రదీప్ కోసం దాచుకోవే నా దగ్గరెందుకు" అని టీజింగ్‌గా అంది జ్వాల.

"అస్సలు పెళ్ళయితే కదే అవన్నీ నాకంత అదృష్టం కూడానా?"అంది బాధగా.

జ్వాల కంగారుగా "ఎందుకే అలా మాట్లాడతావు? ఇప్పుడేమయిందని? నేను రానంటే నువ్విలాంటి తిక్కతిక్క ఆలోచనలు చేస్తావని తెలిసే రావడానికి సిద్ధమవుతున్నాను. నువ్వలా ప్రశాంతంగా కూర్చో టిఫిన్ చేసి వెళ్దాము".

శాంతి కంగారుగా "అంత టైమ్ లేదే అక్కడ ప్రదీప్ వాళ్ళందరు చూస్తుంటారు. త్వరగా రావే ప్లీజ్..."

"చూడు శాంతీ మనం ముందు వెళ్ళి చేసేదేమీ లేదు. రిజిస్ట్రార్ ఆఫీసు కూడా తెరిచి ఉండరు. ఇక ప్రదీప్ వాళ్ళంటావా మన కోసం చూస్తూ ఉంటారు. వాళ్ళకు అది అలవాటే. ఈ రోజు కొత్తగా టైమ్ వేస్టయ్యేదేమీ లేదు".

జ్వాల ఇలా చెప్పడంతో మౌనంగా కుర్చీలో కూర్చుంది శాంతి.

"జ్వాలా క్యాసెట్ మార్చు" అని జ్వాల చిన్నాన్న హరి చెప్పే వరకు శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం పూర్తయిందని వారు గుర్తించలేదు.

జ్వాల లేచి వెళ్ళి భగవద్గీత క్యాసెట్ మార్చింది. గీతలోని భావామృతానికి ఘంటసాల గానామృతం తోడై శ్రావ్యంగా వినిపిస్తోంది. జ్వాల అక్కడే ఉన్న కుర్చీలో కూర్చుని కళ్ళు మూసుకుని తదాత్మ్యంతో భగవద్గీత వింటోంది.

జ్వాలను చూస్తున్న శాంతి జ్వాల కుటుంబం ఇంత ప్రశాంతంగా, ఆనందంగా అన్నింటికన్నా ముఖ్యంగా ఆత్మవిశ్వాసంతో తొణికిసలాడటానికి, క్రమం తప్పకుండా పాటించే ఈ భక్తిభావం, వారికున్న క్రమశిక్షణ, వారిని సమున్నతంగా తీర్చిదిద్దింది అని అనుకోకుండా ఉండలేక పోయింది.

ఇంతలో టిఫిన్ రెడీ అయిందని జ్వాలా వాళ్ళ అమ్మ పిలిస్తే వెళ్ళి త్వరత్వరగా టిఫిన్ చేయడం ముగించారు.

"ఇంకో అరగంట టైముంది నిదానంగా వెళదాము" అని జ్వాల చెపుతున్నా శాంతి వినకుండా బయటకు పరుగెత్తింది.

ఇక తప్పదని జ్వాల కూడా ఆమె వెంట నడిచింది. శాంతి తన స్కూటీని బయటకు తీయబోతుంటే వద్దని వారించి జ్వాల శాంతిని తన హీరోహోండా పైనే కూర్చోపెట్టుకుని ముందుకు వెళ్ళింది.

అనుకున్న టైమ్‌కన్నా పది నిమిషాల ముందే వాళ్ళ బైక్ రిజిస్ట్రార్ ఆఫీసు ముందు ఆగింది. అక్కడ శాంతి ఊహించినట్లే ప్రదీప్ అతని ఫ్రెండ్స్, శాంతికి కావలసిన స్నేహితులిద్దరూ అక్కడ వేచి ఉన్నారు. వీళ్ళెక్కిన బైక్ ఆగీ ఆగగానే వాళ్ళందరూ వీళ్ళిద్దరి దగ్గర కొచ్చారు.

ప్రదీప్ జ్వాలను చూస్తూనే ముఖం చిట్లించుకున్నారు. అతనికి జ్వాల అంటే కోపం, ఆ అమ్మాయి నిజాయితీ, ముక్కుసూటి దనం ఇతనికి నచ్చవు. కానీ తన ప్రియురాలు శాంతికి స్నేహితురాలు కాబట్టి తప్పదన్నట్లు మొక్కు బడిగా పలుకరిస్తుంటాడు. ఇప్పుడు అదీ లేదు.

ప్రదీప్ శాంతి దగ్గరకు వెళ్ళి "ఏంటి శాంతీ! ఇంత ఆలస్యం? మేమెంత కంగారుగా ఎదురు చూస్తున్నామో తెలుసా? ఇదేంటి ఇలా వచ్చావు, మెడలో నగలేవీ, పెళ్ళికూతురు ఇలాగా వచ్చేది? చాలా నగలున్నాయి అని చెప్పావు కదూ!"

"అబ్బా! ఉండకేం ఉన్నాయి? కానీ అవి మోసే ఓపిక నాకు లేదు. అవన్నీ అలంకరించుకుని గంగిరెద్దులా ఊరేగడం నాకిష్టం లేదు. ముందు జరగవలసింది చూడు ప్రదీప్!" అంది విసుగ్గా శాంతి.

ప్రదీప్ ఆమె విసుగును, ఆతృతను ఏ మాత్రం పట్టించుకోకుండా "అదేంటి శాంతి అలా అంటావ్. వంటిపైన వేసుకోను బరువైతే, చేతిలోనైనా పట్టుకురావచ్చు కదా. మళ్ళీ మనం కావాలనుకున్నప్పుడు అవి మనకు రావు కదా అనే కనీస జ్ఞానం నీకు లేదా? అవి అలా ఉంచు. ఇంతకూ డి.డి. నా పేరుమీద తీసుకోమన్నాను అదైనా తెచ్చావా?"

శాంతి మనసులో ఏదో అనుమానం ఒక చిన్న బిందువులా మొదలై మనసంతా ఆక్రమిస్తుంటే, బాధ, భయం, కోపం, బలవంతాన ఆపుకుంటూ "అయ్యో ప్రదీప్ డ్రాఫ్టను నువ్వు చెప్పినట్లే తీసుకున్నాను. ఈ కంగారులో ఇంటి వద్దే మరచిపోయి వచ్చేశాను. అవన్నీ తరువాత ఆలోచిద్దాం. ప్రదీప్, ఇప్పుడు జరగాల్సింది చూద్దాం పద" అంటూ వాతావరణాన్ని తేలిక చేసే ఉద్దేశ్యంతో నవ్వుతూ రిజిస్ట్రార్ ఆఫీసు వైపు కదిలింది శాంతి.

ప్రదీప్ ఆమె దారికి అడ్డుగా నిలబడి "పెళ్ళి ఈ రోజు కాకపోతే, ఇంకో రోజు చేసుకోవచ్చు. పెళ్ళయ్యాక డబ్బుల్లేకపోతే ఎలా బ్రతుకుతాం. నిన్ను పెళ్ళి చేసుకున్న మరుక్షణం నేను రోడ్డున పడాలి. మీ ఇంట్లోవాళ్ళు రానివ్వరు. మా ఇంట్లో వాళ్ళు రానివ్వరు. అపుడు నా బ్రతుకు తేజ 'చిత్రం' సినిమా అవుతుంది".

ఇంతసేపూ ఓపిగ్గా ఉన్న జ్వాల ఇక ఆపుకోలేక కల్పించుకుని "చూడు ప్రదీప్ శాంతి నగలకు ఆమె అక్కౌంట్లో ఉన్న డబ్బుకు, మీ పెళ్ళికి ఏమిటీ సంబంధం? అనుకున్న ముహూర్తం దాటిపోక ముందే పెళ్ళి జరిపిస్తే మిగతా విషయాలు తరువాత చూసుకోవచ్చు" అని నచ్చచెప్పే ప్రయత్నం చేసింది.

ప్రదీప్ చాలా సీరియస్‌గా "ఒక్కరూ నా లాజిక్ అర్థం చేసుకోరేంటి? పెళ్ళయ్యాక అందరికీ దూరమవుతాము, డబ్బుల్లేకపోతే ఎలా బ్రతుకుతాము. ఆదర్శాలు కూడుపెట్టవు కదా!".

అప్పటికే శాంతి కన్నీటి పర్యంతమయింది. ఏడుస్తూ "ఇవన్నీ ముందే చెప్పి ఉండొచ్చు కదా! అయినా నాకన్నా నీ దగ్గరే డబ్బెక్కు వుంది. అది తేవచ్చు కదా! ముందేమో ఆదర్శాలు వల్లించావు, ఇప్పుడేమో డబ్బే ముఖ్యమంటున్నావు" ఆపుకోలేని ఉక్రోషంతో అడిగేసింది.

ప్రదీప్ తీక్షణంగా చూస్తూ కంఠం పెంచి "శాంతీ నేను చెప్పేది అర్థం చేసుకోకుండా అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నావ్. ఇప్పుడు నేను కాదనుకుని వెళితే నీకు చావే శరణ్యం" ప్రేమికుడన్న ముసుగు చీల్చుకుని అసలు రూపం బయటపెట్టాడు.

ఇది ఏ మాత్రం ఊహించని శాంతి విలవిలలాడిపోయింది. ఊపిరి ఆడనట్లు ఉక్కిరిబిక్కిరయింది. ఇలాంటి అధముడికోసమా తాను తన వాళ్ళనందరినీ వదులుకుని వచ్చేసింది. ఇంతటి నీచుడితోనా తాను వైవాహిక జీవితాన్ని అల్లుకోడానికి సిద్ధపడింది.

మనసు భగ్గున మండుతోంటే వెళ్ళి ప్రదీప్ కాలర్ పట్టుకుంది. అతని ఫ్రెండ్స్ విడిపించే ప్రయత్నం చేస్తున్నారు. కానీ ఆక్రోశంతో బిగుసుకుపోయిన ఆమె చేతిని వదిలించలేకున్నారు.

జ్వాల జరిగే సన్నివేశాన్నంతటిని తాను ముందే ఊహించినట్లు ఏ మాత్రం ఆశ్చర్యపోకుండా ప్రేక్షకురాలిగా చూస్తోంది.

## నానీలు

ఎంతటి సమైక్యత?
ఎక్కడెక్కడి
పువ్వులో
ఒకే హారంలో

పల్లవికి
అనుపల్లవి, చరణాలు
తోడున్నాయి
నీకు నీ మంచే తోడు

సంద్రంలో
కల్సిపోతామని తెల్సు
అయినా ఆగలేదు చూడు
నదుల ప్రస్థానం

మాస్టారు పాసయ్యారంట
తన స్టూడెంట్‌కి
స్టేట్‌ర్యాంకు
వచ్చింది మరి!

- జి. రంగబాబు

తరతరాల నుండి అణిగివున్న స్త్రీ కాలర్ పట్టుకోవడం వరకూ వచ్చిందంటే పురుషాహంకారం సహిస్తుందా? ప్రదీప్ కొట్టిన చెంప దెబ్బతో విసురుగా వచ్చి జ్వాల కాళ్ళదగ్గర పడింది శాంతి. క్రింద పడి నిస్సహాయంగా రోదిస్తోంది. ఆ దృశ్యం కసాయి గుండెను సైతం కరిగించేట్లుగా ఉంది. కానీ ప్రదీప్ నిస్సిగ్గుగా నవ్వుతూ నిలబడ్డాడు.

జ్వాల ఆవేశాన్ని ఆపుకోలేకపోతోంది. రక్తం ఉవ్వెత్తున పోటెత్తుతుంటే ఆవేశం చెలియలకట్ట దాటుతుంటే ప్రభంజనమై ప్రళయకాలంలో ఝంఝూమారుతంవలె ముందుకు కదిలింది.

జ్వాలకి 'కుంగ్‌ఫూ, కరాటే లాంటివేమీ తెలీదు. ఆరోగ్యం కోసం అనుదినం చేసే యోగా తప్ప. కానీ కళ్ళముందు జరిగిన ఘోరం కసిని లేపుతుంటే, తన స్నేహితురాలి కళ్ళ నుండి జారే కన్నీరు ఆమె హృదయంలో రగిలే అగ్నికి ఆజ్యం అవుతుంటే, తరతరాలుగా స్త్రీ జాతిపైన పురుషాహంకారం చేసే ఘీంకారం ఆమె చెవులను బ్రద్దలు కొడుతుంటే చేతిలో ఏ ఆయుధమూ లేని ఆమే ఆయుధమై ముందుకు కదిలింది.

ప్రదీప్ గుండెలపై మెరుస్తున్న పులిగోరు లాకెట్ ఆమె లక్ష్యాన్ని సూటిగా నిర్దేశిస్తోంది. ఆమె ముందుకెళ్తుంటే లక్ష్యం సమున్నతమై అంతకంతకూ పెరిగి జ్వాల కళ్ళముందు పులిగోరు డాలర్ మాత్రమే నిలిచింది. మరుక్షణం ప్రదీప్ ఆరడుగుల శరీరం గాల్లో లేచి, అతని వెనక మరో నాలుగడుగుల దూరంలో ఆపి ఉంచిన కారుకు గ్రుద్దుకుని క్రింద పడింది. అతనికేకాదు అక్కడున్న ఎవ్వరికీ జరిగిందేమిటో అర్థం కాలేదు. అందరూ నివ్వెరపోయి చూస్తున్నారు. వీళ్ళ ఆశ్చర్యంతో పని లేదన్నట్లుగా ప్రదీప్ చిట్లిన పెదవి నుంచి రక్తం బొట్లు బొట్లుగా నేలపైకి జారుతోంది. అందరికన్నా ముందుగా తేరుకున్నది శాంతి. అక్కడున్న అందరూ జ్వాలను శాంతి కోప్పడుతుంది అనుకున్నారు. ఎందుకంటే ఇప్పటివరకు చరిత్ర నేర్పింది అదే కదా! కానీ శాంతి అలా చేయలేదు. నేరుగా వెళ్ళి ప్రదీప్ ముఖాన కాండ్రించి ఉమ్మేసింది.

జ్వాల తన్నడంకన్నా ఇది దారుణంగా ఉంది. ఎంత దారుణమైనా జరిగింది అదే. అందరూ చరిత్ర చూపిన దారినే నడవరు. కొందరు ఇలా చరిత్రను తమను అనుసరించమని నిర్దేశిస్తారు. వాళ్ళకు ఏ ఫెమినిజం అక్కరలేదు. వాళ్ళపైన వాళ్ళకున్న నమ్మకం చాలు.

వాళ్ళు ఎక్కిన బైక్ వేగంగా దూసుకుపోతోంది. జ్వాల శాంతికి చెప్తున్న మాటలు విశ్వమంతా వ్యాపిస్తున్నాయి. శాంతిలాంటి ఎంతో మంది వ్యథల నుంచి వేదనల నుంచి రక్షించటానికి అన్న మాటలు అవి. "శాంతీ మనసనేది మనం రికార్డు చేసిన క్యాసెట్ లాంటిది. ప్రదీప్ ప్రేమ ఉన్నస్థానంలో నీకిష్టమైన ఇంకో అంశాన్ని రికార్డు చేయి. ఆటోమేటిక్‌గా అంతకుముందు న్నది తుడిచి పెట్టుకుపోతుంది. అది నిశ్చయంగా నీకు ఆనందాన్నిస్తుంది. ఒక్కసారి ఇది అలవాటయిందనుకో నీ క్యాసెట్‌లో నీకు ఆనందాన్ని ఇచ్చే అంశాలు మాత్రమే ఉంటాయి. అందంగా జీవించడానికి ఇంతకు మించిన ఫిలాసఫీ లేదు శాంతీ!..." ☆